## క్లుప్తంగా

### బీజేపీ అసెంబ్లీ కన్వీనర్‌గా ఉట్టి శ్రీనివాసులు

**పోరుమామిళ్ల :** బద్వేలు నియోజకవర్గ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్‌గా ఉట్టి శ్రీనివాసులును నియమిస్తున్నట్లు మంగళవారం రాత్రి ఆయనకు అధిష్టానం నియామకపత్రం పంపింది. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ తాను చేసిన రాజకీయ పోరాటాలు, హిందూ ధార్మిక కార్యక్రమాలు, రైతాంగ సమస్యలపై ఆందోళనలు దృష్టిలో పెట్టుకుని అసెంబ్లీ కన్వీనర్‌గా నియమించారన్నారు. పార్టీ అభివృద్ధికి త్రికరణశుద్ధిగా పని చేస్తానన్నారు.

### దేశానికి ఆదర్శప్రాయుడు అల్లూరి

**పోరుమామిళ్ల :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం చరిత్ర అధ్యాపకులు శివారెడ్డి ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 126 వ జయంతిని ఘనంగా నిర్వహించారు. సీనియర్ అధ్యాపకురాలు డాక్టర్ సులోచన మాట్లాడుతూ బ్రిటీష్ తుపాకులకు ఎదురొడ్డి నిలబడి, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన ఉద్యమ వీరుడు అల్లూరి సీతారామరాజు అన్నారు. అల్లూరి సీతారామరాజు గురించి అధ్యాపకులు సబిత, గురమ్మ, నరసింహారెడ్డి మాట్లాడారు. ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో స్కిల్‌హబ్ శిక్షకులు మోహన్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

### నేడు జగనన్న సురక్ష సభ

**అట్లూరు :** మండలంలోని కమలకూరు సచివాలయ పరిధిలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ముడమాల ప్రభాకర్‌రెడ్డి, సచివాలయాల కన్వీనరు మణ్యం గంగిరెడ్డి తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అందిస్తున్న సర్వీసులను ప్రజలు ఉచితంగా పొందాలని వారు కోరారు.

**చాపాడు :** మండలంలోని అయ్యవారిపల్లెలో గురువారం జగనన్న సురక్ష గ్రామ సభ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ రాధాకృష్ణవేణి తెలిపారు. గ్రామ సచివాలయం వద్ద ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామసభ ఉంటుందన్నారు. అర్హులైన లబ్ధిదారులకు వివిధ రకాలైన ధృవీకరణ పత్రాలను పంపిణీ చేస్తారన్నారు.

### రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

**పోరుమామిళ్ల :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రైతుకు పెట్టుబడి సాయాన్ని తెలంగాణ తరహాలో రూ. పదివేలు అందించాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం డిప్యూటీ తహసీల్దారు సంజీవరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. సీపీఐ నాయకులు పిడుగు మస్తాన్, రవి, కేశవ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన మద్దతు ధరలు శాస్త్రీయంగా ఉన్నాయని, అయితే వివిధ కారణాల వల్ల రైతులు రుణభారంతో కుంగిపోతున్నారన్నారు. రైతులకు పెట్టుబడి సహాయంతో పాటు ఉచితంగా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించాలన్నారు. 50 సంవత్సరాలు నిండిన ప్రతి రైతుకు నెలకు రూ. 10 వేలు పింఛన్ ఇవ్వాలని కోరారు.

### నేడు ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం

**చాపాడు :** మండల పరిధిలోని ఖాదర్‌పల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ 104 వాహనం ద్వారా వైద్యురాలు శ్రీవాణి ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేస్తారని ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని వైద్యాధికారి కోరారు.

### విద్యాసంస్థల బంద్ విజయవంతం



విద్యాసంస్థ బంద్ చేయించిన ఏబీవీపీ నాయకులు

**పోరుమామిళ్ల :** ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన బంద్ విజయవంతమైంది. పట్టణంలోని పాఠశాలలు బంద్ చేయించి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని అధికారులకు విజ్ఞప్తి చేసినట్లు ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అభిలాష్ తెలిపారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, పుస్తకాలు, యూనిఫాం పేరుతో తల్లిదండ్రులను పీక్కు తింటున్నారని అభిలాష్ ఆరోపించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ప్రభుత్వం సహకరించాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

### ఎకరాకు రూ.10 వేలు ఇవ్వాలి

**మైదుకూరు :** తెలంగాణ తరహాలో ప్రతి రైతుకు ఎకరాకు రూ.10 వేలు సాగు సాయం అందించాలని ఏపీ రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం సంఘం నాయకులు మైదుకూరులోని 9వ వార్డు సచివాలయం సిబ్బందికి వినతిపత్రం అందించారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం లేనందున రైతుల ఆత్మహత్యలను నివారించేందుకు రైతులకు, కౌలుదారులకు రెండు ఎకరాల మేరకు రూ.20 వేలు సాయం అందించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, శ్రీరాములు, సి.పెద్దపుల్లయ్య, పి.భాస్కర్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు వరం.. జగనన్న సురక్ష

**జగనన్న సురక్షలో ఎమ్మెల్యేలు రాచమల్లు, రఘురామిరెడ్డి**



ప్రొద్దుటూరు : సర్టిఫికెట్ అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ఖాజీపేట : నూతన సచివాలయంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

**ప్రొద్దుటూరు :** ప్రజలు సర్టిఫికెట్లతోపాటు సంక్షేమ పథకాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరగాల్సిన అవసరం లేకుండా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 9, 14, 15 వార్డులకు సంబంధించి శ్రీనివాసనగర్‌లో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో సర్టిఫికెట్ల కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టు చెప్పులరిగేలా తిరగాల్సి వచ్చేదని, పలుకుబడి అవసరమయ్యేదన్నారు. ప్రస్తుతం ప్రజలు దరఖాస్తు చేసుకున్న వెంటనే ఉచితంగా సర్టిఫికెట్లను మంజూరు చేస్తున్నారన్నారు. మూడు సచివాలయాలకు సంబంధించి 821 మంది దరఖాస్తు చేసుకోగా 735 మందికి సర్టిఫికెట్లు మంజూరు చేశారన్నారు. వైఎస్సార్‌కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.2వేలు కోట్లు సంక్షేమ పథకాల రూపంలో ప్రజలకు అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సత్యం, జిలాన్, ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, పట్టణ సచివాలయ కన్వీనర్ కాకర్ల నాగేశ్వారెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కామిశెట్టి బాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, డీఈ దస్తగిరి, డిప్యూటీ తహసీల్దార్ మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

**అందరి సంక్షేమ మే ప్రభుత్వ లక్ష్యం**

**ఖాజీపేట :** అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. భూమాయపల్లె పంచాయతీలోని ముత్తులూరుపాడు గ్రామంలో బుధవారం నూతనంగా నిర్మించిన సచివాలయ భవనంను ప్రారంభించారు. అనంతరం జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమంను దృష్టిలో ఉంచుకుని పాలనను మీ ముందుకు తీసుకువచ్చిందన్నారు. మీ ఇంటికే అన్ని సర్టిఫికెట్లు అందుతాయన్నారు. గత ప్రభుత్వం 5 సంవత్సరాల పాలనలో కేసీకాలువకు సక్రమంగా నీరు అందించలేదన్నారు. నేడు కేసీకాలువ ద్వారా రైతులకు రెండుకార్లకు నీరు అందిస్తున్నామ న్నారు. నీటిని మేవరకు చరిత్రలో ఎప్పుడూ ఇవ్వలేదన్నారు. మన కోసం పనిచేసే ప్రభుత్వంను ప్రోత్సహించాలని అప్పుడే ప్రజలకు మరింత మేలు జరిగే అవకాశం ఉంద న్నారు. కార్యక్రమంలో ఎపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, ఎంపీపీ అబుబకర్ సిద్ధిక్, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా, భూమాయపల్లె సర్పంచ్ వెంకటసుబ్బయ్య, జెట్పీటీసీ భర్త దవనం గంగాధర్, సచివాలయ కన్వీనర్ ముమ్మడి వెంకటశివా నందకుమార్ రెడ్డి, మోహన్‌రెడ్డి, తప్పెట రామకృష్ణారెడ్డి, పుల్లూరు మాజీ ఉపసర్పంచ్ నాగేశ్వర్‌రెడ్డి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు మున్వర్, ఖాజీపేట మండల ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు చిన్నారెడ్డి, కృష్ణారెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

**మహిళాసంక్షేమంతోనే కుటుంబం అభివృద్ధి**

**చాపాడు :** మహిళాసంక్షేమంతోనే కుటుంబం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. మండలంలోని ఖాదర్‌పల్లె గ్రామసచివాలయం వద్ద బుధవారం జగనన్న సురక్ష గ్రామ సభ నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు మంచి చేయాలని ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంలో సీఎం వైఎస్ జగన్ మహిళలకే అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. గత ఎన్నికల్లో డ్వాక్రా మహిళలను నిలువునా చంద్రబాబు మోసం చేస్తే.. జగన్ చెప్పిన హామీని అమలు చేశారన్నారు. ఖాదర్‌పల్లె గ్రామ సచివాలయ పరిధిలో అమ్మఒడి, ఆసరా, చేయూత, విద్యా దీవెన, వసతి దీవెన, పింఛన్లు ఇలా అనేక విధాలుగా రూ.16 కోట్ల మేర సంక్షేమ పథకాలు అందాయన్నారు. అనంతరం 300 మంది లబ్ధిదారులకు వివిధ రకాలైన ధృవీకరణ పత్రాలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తెలిదేల లక్షుమయ్య, వైస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ షమీబ్‌భాను, ప్రత్యేకాధికారి సురేష్‌రెడ్డి, తహసీల్దారు సుభానీ, ఇన్‌చార్జి ఎంపీడీఓ రాధాకృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామోహన్‌రెడ్డి, జైనుల్లా, రమణయ్య, ప్రసాద్, జయరామిరెడ్డి, జయసుబ్బారెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి**

**మైదుకూరు :** ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ అందించాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర అన్నారు. బుధవారం పట్టణంలోని విజయనగర కాలనీలో 10వ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 343 మంది అభ్యర్థన మేరకు పరిశీలించి 148 మందికి సర్టిఫికెట్లను అందజేశారు. మిగిలిన వారికి త్వరలోనే సర్టిఫికెట్లను అందజేస్తామని అధికారులు తెలిపారు. శిబిరంలో మున్సిపల్ కమిషనర్ వై.రంగస్వామి, డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున, సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**కాశినాయనలో..**

**కాశినాయన :** జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ డి.సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఎస్.పోలమ్మలు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కత్తెరగండ్ల సచివాలయం ఆవరణలో ఎంపీడీఓ మైథిలి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వలంటీర్ల వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల ఇళ్ళ వద్దకే ప్రభుత్వ పథకాలు చేరుతున్నాయన్నారు. అనంతరం లబ్ధిదారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, తహసీల్దారు రామచంద్రుడు, ఈఓపీఆర్‌డీ ముజఫర్‌రహీమ్, స్థానిక సర్పంచ్ సుభద్రమ్మ, రెడ్డికొట్టాల సర్పంచ్ గురమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు, వలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

**అర్హులందరికీ సంక్షేమ పథకాలు**

**పోరుమామిళ్ల :** అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పోరుమామిళ్ల 4వ సచివాలయంలో నిర్వహించిన 'జగనన్న సురక్ష' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నవరత్నాలు కార్యక్రమాన్ని ప్రారంభించి 42 రకాల సేవలు, సచివాలయ వ్యవస్థ ద్వారా మరో 12 రకాల సేవలను సీఎం వైఎస్ జగన్ తీసుకవచ్చారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు పెట్టి, ఆ పార్టీ సానుభూతి పరులకే పథకాలు అందించారన్నారు. ఈరోజు పార్టీలు, ప్రాంతాలు, కులాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాళ్లపల్లె రవి, ఎంపీటీసీ విజయకుమారి, స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పాల్గొన్నారు.

**తెల్లపాడులో జగనన్న సురక్ష**

**కలసపాడు :** మండలంలోని తెల్లపాడులో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. తెల్లపాడు గ్రామ పంచాయతీలోని మూడు గ్రామాల్లో 81 దరఖాస్తులు రాగా 56 సర్టిఫికెట్లను పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ మహబూబ్‌బీ తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మురళీధర్‌రెడ్డి, తహసీల్దారు రవీంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అంకనగురివిరెడ్డి, సూదారామకృష్ణారెడ్డి, సుదర్శన్, నారాయణయాదవ్, చిత్తారాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ ఓ.లైసమ్మ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

**బ్రహ్మంగారిమఠంలో..**

**బ్రహ్మంగారిమఠం :** మండలంలోని రేకలకుంట 2 అగ్రహారం గ్రామ సచివాలయంలో ఏర్పాటుచేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి మాట్లాడుతూ జగనన్న సురక్ష అంటే ప్రతి పేదవాడికి ప్రభుత్వం ఇస్తున్న పథకం అందేలా చూడటమే అన్నారు. ఇంకా ఎవరికైనా పథకాలు అందకుంటే అందేలా చూడాలన్నారు. ఎంపీడీఓ వెంగమునిరెడ్డి మాట్లాడుతూ రేకలకుంట 2 సచివాలయం పరిధిలో 45 మందికి సర్టిఫికెట్లు ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు సుహాసిని, మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ కూన పులి రాజానాయుడు, సర్పంచ్ జోత్స్న, ఉపసర్పంచ్ బసిరెడ్డి, గ్రామ సచివాలయ కార్యదర్శి సురేష్‌బాబు, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

**దువ్వూరులో..**

**దువ్వూరు :** మండలంలోని చల్లబసాయపల్లె సచివాలయ పరిధిలో బుధవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో తహసీల్దార్ రమకుమారి మాట్లాడుతూ 30 రోజుల వ్యవధిలో జారీ చేయాల్సిన సర్టిఫికెట్లను 3, 4 గంటల వ్యవధిలోనే దరఖాస్తుదారులకు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం 67 మంది అర్జీదారులకు సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సంగన చంద్రకళావతి, ఎంపీటీసీ స్వర్ణ ఓబుళమ్మ, మాజీ సర్పంచ్ సంగన లక్ష్మిరెడ్డి, రెవెన్యూ సిబ్బంది, పాల్గొన్నారు.

## అర్హులందరికీ పథకాలు అందించాలన్నదే లక్ష్యం

**జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్**



బద్వేలు : జగనన్న సురక్ష కార్యక్రమంలో ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న జేసీ, ఎమ్మెల్యే

**బద్వేలు అర్బన్ :** అర్హత ఉండి కూడా ప్రభుత్వ పథకాలకు దూరంగా ఉన్న వారిని గుర్తించి వారికి కూడా సంక్షేమ పథకాలు అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిందని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని సురేంద్రనగర్ సచివాలయం ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష క్యాంపులో ఎమ్మెల్యే డాక్టర్ సుధతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా సచివాలయం పరిధిలో ప్రజల నుండి ఎన్ని దరఖాస్తులు అందాయి అనే దానిపై ఆరా తీశారు. అలాగే ప్రజలతో నేరుగా మాట్లాడి ఇంకా ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏదైనా కారణాల చేత అన్ని అర్హతలు ఉన్నప్పటికీ పథకాలు అందకుండా ఉన్న వారిని గుర్తించి వారికి కూడా పథకాలు అందించేందుకు జగనన్న సురక్ష ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ సుధ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు నిత్యం అవసరమయ్యే 11 రకాల సేవలను ఎటువంటి ఫీజులు వసూలు చేయకుండా ఉచితంగా అందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆకులవెంకటరమణ, నగర కార్పొరేషన్ చైర్‌పర్సన్ రమణమ్మ, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణ, కౌన్సిలర్ చెన్నయ్య, మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, తహసీల్దారు మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజి వద్ద నిరసన



వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అకడమిక్ కన్సల్టెంట్లు

**ప్రొద్దుటూరు :** స్థానిక వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజీలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. పదేళ్ల నుంచి పని చేస్తున్న తమను ప్రతి ఏడాది ఒక నెల విరామం ఇచ్చిన తర్వాత తిరిగి విధుల్లోకి తీసుకుంటున్నారన్నారు. ఈ ఏడాది మాత్రం కొత్తగా ఇంటర్వ్యూలు నిర్వహించి తీసుకోవాలని యూనివర్సిటీ అధికారులు నిర్ణయించడం తగదన్నారు. కొత్తగా జారీ చేసిన జీఓ నంబర్ 110 ప్రకారం పీహెచ్‌డీ ఉన్న వారికి రూ.40వేలు, ఎంటెక్ అర్హత ఉన్నవారికి రూ.35వేలు, సర్వీసును బట్టి ఏడాదికి రూ.1000 పెంచాలని జీఓలో ఉందన్నారు. అధికారులు అందుకు విరుద్ధంగా ఇంటర్వ్యూలు నిర్వహించి సర్వీసును తొలగించాలని చూస్తున్నారన్నారు. కొత్తగా ఇంటర్వ్యూలు నిర్వహించాలని జీఓలో ఎక్కగా చెప్పలేదని, రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించకుండా యధాతథంగా కొనసాగిస్తున్నారన్నారు.

**నిబంధనల ప్రకారమే ఇంటర్వ్యూలు**

నిబంధనల ప్రకారమే అన్ని యూనివర్సిటీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించారని వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ సి.నాగరాజు బుధవారం తెలిపారు. నిబంధనల ప్రకారం అకడమిక్ కన్సల్టెంట్లను నియమించేందుకు ఇంటర్వ్యూలు నిర్వహించగా ఎవరూ హాజరు కాలేదన్నారు. పనిచేస్తున్న వారికి మేలు చేయాలనే ఉద్దేశంతో జీఓ ఎంఎస్ నంబర్ 110ని అమలు చేయాలని యూనివర్సిటీ అధికారులు కమిటీ వేశారని చెప్పారు. చైర్మన్‌గా వైస్ ఛాన్సలర్ సి.సుధాకర్‌తోపాటు మెంబర్లు ఉన్నారన్నారు. ఇంటర్వ్యూలకు అన్ని ఏర్పాట్లు చేసినా వారు హాజరు కాలేదన్నారు. ఇంటర్వ్యూలను తిరస్కరించి కళాశాల ఆవరణలో బైఠాయించారన్నారు. కేవలం వ్యక్తిగత అనుమానాలతోనే వారు ఇంటర్వ్యూలకు హాజరు కాలేదని తెలిపారు.

## కాశీవరపు వెంకటసుబ్బయ్యకు అభినందనలు

**ప్రొద్దుటూరు కల్చరల్ :** స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో బుధవారం కథా రచయిత కాశీవరపు వెంకటసుబ్బయ్యకు కొలకలూరి ఇనాక్ జాతీయ కవితా పురస్కారం ప్రకటించిన సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ కాశీవరపు వెంకట సుబ్బయ్య కవిగా, కథా రచయితగా పేరు ప్రఖ్యాతలు సంపాదించారన్నారు. ఆయన రాసిన ఎద మీటిన రాగాలు కవితా సంపుటికి ప్రతిష్ఠాత్మకమైన కొలకలూరి ఇనాక్ జాతీయ పురస్కారం లభించడం హర్షణీయమన్నారు. వెంకటసుబ్బయ్య మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, రచయిత జింకా సుబ్రహ్మణ్యం, ఎస్ఎల్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్ కొండయ్య, కోశాధికారి బోగా గంగాధర్, రామచంద్ర, రఫీక్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కుష్టు వ్యాధి ఇంటింటి సర్వే తనిఖీ



పరీక్షస్తున్న జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖాదర్‌వల్లి

**ప్రొద్దుటూరు క్రైం :** స్థానిక సంజీవన్‌నగర్, వైఎంఆర్ కాలనీలో జరుగుతున్న కుష్టు వ్యాధి ఇంటింటి సర్వేను జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖాదర్‌వల్లి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 16వ తేదీ వరకు కుష్టువ్యాధి ఇంటింటి సర్వే కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ సర్వేలో స్పర్శలేని, రాగి వర్ణంలో ఉన్న పొడలను గుర్తించి డాక్టర్ ద్వారా ఆ పొడలు కుష్టువ్యాధికి సంబంధించినవని నిర్ధారణ అయితే ఆరు నెలలు పాటు ఉచితంగా చికిత్స అందిస్తామన్నారు. ఈ వ్యాధిని ప్రారంభ దశలో గుర్తిస్తే అంగవైకల్యం రాకుండా చూసుకోవచ్చన్నారు. సర్వే సిబ్బందికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. వైద్యాధికారులు డాక్టర్లు సునీల్ కుమార్, దినేష్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సీఓలు సుబ్బారెడ్డి, నాగజ్యోతి పాల్గొన్నారు.

## పాత కలెక్టరేట్‌ను పరిశీలించిన అధికారులు

**కడప కల్చరల్ :** పాత కలెక్టరేట్‌ను బుధవారం జిల్లా అధికారులు పరిశీలించారు. జిల్లా తలమానికంగా నిలిచిన అత్యంత ప్రాచీనమైన వారసత్వ సంపదగా భావిస్తున్న ఈ భవనానికి అవసరమైన మరమ్మతులు చేసి వినియోగంలోకి తెచ్చేందుకు కలెక్టర్ సూచన మేరకు అధికారులు సాంకేతిక బృందంతో పరిశీలించారు. కలెక్టర్ ఓఎస్‌డీ రఘునాథ్, పంచాయతీరాజ్‌శాఖ ఎస్ఈ శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రోనాల్డ్, గునిశెట్టి శ్రీనివాసులు ఇతర సిబ్బందితోకలిసి బుధవారం సాయంత్రం పాత కలెక్టరేట్ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఈ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఈ భవనాన్ని పునరుద్ధరించేందుకు కలెక్టర్ శ్రద్ధ కనబరుస్తున్నారని, ఆయన ఆదేశాల మేరకు తాము ఇతర అధికారులతో కలిసి పాత కలెక్టరేట్ భవనాన్ని, అందులోని అన్ని విభాగాలు, భవనం అణువణువు పరిశీలించామన్నారు. నివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు, తర్వాత ఆయన సూచనల మేరకు పనులు చేపడతామని వివరించారు. ఈ సందర్భంగా ఓఎస్‌డీ రఘునాథ్ తదితరులు పాత కలెక్టరేట్ భవనంలోని ఇంటాక్ కార్యాలయాన్ని సందర్శించారు. పలువురు ఇంటాక్ సభ్యులు పాల్గొన్నారు.

### నేడు గడప గడపకు మనప్రభుత్వం

**బ్రహ్మంగారిమఠం :** మండలంలోని గొడ్లవీడుపంచాయతీలో గురువారం ఉదయం 6 గంటల నుంచి గడప గడపకు మనప్రభుత్వ కార్యక్రమం ఉంటుందని ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డి పాల్గొంటారన్నారు. అనంతరం పీసీపల్లెలో నూతన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొనాలన్నారు.

### ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించాలి

**ప్రొద్దుటూరు కల్చరల్ :** ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం తక్షణమే పాఠ్య పుస్తకాలను అందించాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద బుధవారం రాయలసీమ విద్యార్థి యువజన సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌వైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్న ఇంత వరకు పాఠ్యపుస్తకాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. వెంటనే పాఠ్య పుస్తకాలు అందించాలని డిమాండ్ చేశారు. ఆర్ఎస్‌వైఎఫ్ నాయకులు శివ, వినయ్, అశోక్, నాగమల్లీశ్వరి, ఉసేన్, బాషా, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

### ధర్నాను విజయవంతం చేయాలి

**ప్రొద్దుటూరు :** అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఈనెల 10, 11 కడప కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న 36 గంటలు ధర్నా పోస్టర్లను స్థానిక ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద బుధవారం ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఆవిష్కరించారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మీదేవి, బి.లక్ష్మిదేవి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 ఏళ్లు అయినా అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించలేదన్నారు. దీక్షలో అంగన్‌వాడీ వర్కర్లందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## వ్యవసాయంలో యాంత్రీకరణతో అధిక దిగుబడి

**బద్వేలు అర్బన్ :** వ్యవసాయ సాగులో ఆధునిక యంత్రాలను వినియోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని చింతలచెరువు సచివాలయం ఆవరణలో ప్రధానమంత్రి కృషి సించాయి యోజన పథకంలో భాగంగా జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయ సంబంధిత పనిముట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు సేవలను దగ్గర చేశారని తెలిపారు. అనంతరం రైతులకు వ్యవసాయ సంబంధిత పనిముట్లను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చిన్నపోలిరెడ్డి, వైస్ ఎంపీపీ బుట్టినరసింహారెడ్డి, ఎంపీటీసీ సుజాత, సర్పంచ్ ఎ.పద్మావతి, ఉప సర్పంచ్ రవికుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు బి.జయసుబ్బారెడ్డి, ఎస్.సుబ్బారెడ్డి, వాటర్‌షెడ్ చైర్మన్ ఎస్.శ్రీకాంత్‌రెడ్డి, వైస్‌చైర్మన్ బి.పద్మావతి, డ్వామా అడిషనల్ పీడీ నాగరత్నమ్మ, వాటర్‌షెడ్ పీఓ వేణుగోపాల్‌రెడ్డి, టీఓ రామ్మోహన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## సంస్థ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి



ఆదర్శ ఉద్యోగులను అభినందిస్తున్న జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్, డీఎం

**బద్వేలు అర్బన్ :** ఆర్టీసీ ఉద్యోగులు సంస్థ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి పి.గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆర్టీసీ గ్యారేజీలో నిర్వహించిన డిపో పరిధిలో వివిధ అంశాలలో మంచి ఫలితాలు సాధించిన ఆదర్శ ఉద్యోగుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి పోటీతత్వంతో పనిచేసి సత్ఫలితాలు సాధించాలని కోరారు. డీజిల్ ఆదా, సంస్థ ఆదాయం, కార్గో సేవలలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఉద్యోగులను, డ్రైవర్లను, కండక్టర్లను, మెకానిక్‌లను సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు, ఎస్‌టీఐ బి.ఎస్.నాయక్, శివప్రసాద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

## లిడ్‌క్యాప్ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలి



సీఐకి వినతిపత్రం సమర్పిస్తున్న లిడ్‌క్యాప్ డైరెక్టర్ కృష్ణమూర్తి

**బద్వేలు అర్బన్ :** మున్సిపాలిటీ పరిధిలోని కమలమ్మకాలనీ సమీపంలో చర్మకారుల సొసైటీకి కేటాయించిన 3.64 ఎకరాల స్థలం కబ్జాకు గురికాకుండా కాపాడాలని లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆర్.కృష్ణమూర్తి కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దారు, సీఐలకు వేరువేరుగా వినతిపత్రాలు సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లిడ్‌క్యాప్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో చర్మకారుల కోసం మంజూరు చేసిన 3.64 ఎకరాల స్థలాన్ని కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి లెదర్ పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ లిడ్‌క్యాప్ డైరెక్టర్ జీ.రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు గొడుగునూరుప్రతాప్, సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అన్నివర్గాల సంక్షేమం జగనన్నతోనే సాధ్యం

**ఎమ్మెల్యే డాక్టర్ సుధ**



ముబారక్‌నగర్‌లో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

**బద్వేలు అర్బన్ :** కులం, మతం, పార్టీ చూడకుండా అర్హత ఉన్న ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తూ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో గల ముబారక్‌నగర్, పూసలవాడలలో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి వార్డులోని ప్రతి గడపను సందర్శించారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను, ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ ఏ ఒక్క సంక్షేమ పథకంలో కోత విధించకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పేదల అభ్యున్నతికి నిరంతరం పరితపించే ప్రజా నాయకుడు వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో నగర కార్పొరేషన్ చైర్‌పర్సన్ రమణమ్మ, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్‌రామిరెడ్డి, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారుశీనయ్య, మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామి, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, వార్డు కౌన్సిలర్ రెడ్డెమ్మ, ఆయా వార్డు ఇన్‌చార్జిలు నాగేశ్వర్‌రావు, రెడ్డెయ్య, మౌలాలి, షఫి, బాబు, రజనీకాంత్, మున్సిపల్ కమీషనర్ కె.వి.కృష్ణారెడ్డి, వివిధశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.